

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - శుక్రవారం

సాయంత్రం - 6.31

సహర్ - శనివారం

ఉదయం - 5.02

# ముగిసిన ఇంటర్ పరీక్షలు

- చివరిరోజు ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- పరీక్ష అనంతరం బేకరీలు, హోటళ్లలో సందడి



పరీక్షలు ముగియడంతో విద్యార్థుల సంబురం

ఆమనగల్లు, మార్చి 14 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఫిబ్రవరి 28న పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలోని నాలుగు కళాశాలలకు చెందిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 390 మంది ప్రథమ, 275 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కాగా, గురువారం సెకండియర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా ఇంటిబాట పట్టారు. కొందరు విద్యార్థులు పరీక్షల ఫలితాలపై ధీమా వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు బేకరీలు, హోటళ్లలో చిన్న, చిన్న పార్టీలు చేసుకోవడం కనిపించింది. ఆమనగల్లు పట్టణంలో టీకొట్లు, జ్యూస్ సెంటర్లు, బేకరీల వద్ద విద్యార్థులు సందడి చేశారు. రెండేళ్ల పాటు ఒకేచోట చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు పూర్తవడంతో విడిపోతున్నామన్న బాధ వారిలో కనిపించింది.



ఆమనగల్లులో పరీక్షల చివరిరోజు బేకరీలో విద్యార్థినుల సందడి

# భోజన బిల్లులో రామచంద్రా!

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఆరు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదు. దీంతో కార్మికులు అప్పులు చేసి మరీ విద్యార్థుల కడుపు నింపుతున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువున్న పాఠశాలల కార్మికులకు అడపా దడపా బిల్లులు చెల్లిస్తున్నా.. శేరిలింగంపల్లి, యాచారం, నందిగామ, కొందుర్గు వంటి పెద్ద పాఠశాలల్లో రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్ ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య ఎక్కువున్న చాలా పాఠశాలలకు నెలల తరబడి బిల్లుల చెల్లింపులు చేయడం లేదు. అప్పుల భారంతో వంటచేసి పెట్టడం భోజన కార్మికులకు భారమైతోంది. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు పుట్టినకాడల్లా అప్పులు చేశాం అని, బంగారాన్నీ తాకట్టు పెట్టాం అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు బిల్లులు చెల్లించాలని భోజన కార్మికులు కోరుతున్నారు.

కొన్ని నెలలుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు అందని పారితోషికాలు

- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- ఆర్థికభారంతో వంట నిర్వాహకులు సతమతం
- అప్పులు చేసి విద్యార్థుల కడుపు నింపుతున్న ఏజెన్సీల నిర్వాహకులు
- బంగారం తాకట్టుపెట్టి వండిపెడుతున్న వైనం
- ఆర్థిక ఇబ్బందులతో వండిపెట్టలేమంటున్న కార్మికులు
- రూ.2కోట్లు మంజూరయ్యాయి : డీఈవో
- మా వద్ద పెండింగ్ లేవంటున్న డీటీవో

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 14 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి నిరక్షరాస్యత నిర్మూలించాలని ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠశాలలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులకు భోజనాన్ని వండి పెట్టేందుకు వంట ఏజెన్సీలను నియమించింది. ఇదిలా ఉంటే కొన్ని నెలలుగా ప్రభుత్వం ఏజెన్సీలకు బిల్లులను విడుదల చేయకపోవడంతో భోజన నిర్వాహకులు అప్పుల ఊబిలో కూరుపోతున్నారు. విద్యార్థులకు వంటచేసి పెట్టడం భోజన కార్మికులకు భారంగా మారింది. వారు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల వస్తువుల కొనుగోళ్లకు వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారు. ప్రతి నెలా మధ్యాహ్న భోజన బిల్లులు ప్రభుత్వం సక్రమంగా చెల్లించక పోవడంతో నిర్వాహకుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. గతేడాది అక్టోబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

### అప్పులు చేసి వండిపెడుతున్నాం



ఆరు నెలలుగా మాకు భోజన బిల్లులు ఇవ్వడం లేదు. అప్పులు చేసి కూరగాయలు, కిరాణ సరుకులు తెస్తున్నాం. దుకాణదారుడు బకాయిలు ఇస్తే తప్ప సరుకులివ్వడం లేదు. మాకు ఎప్పటి బిల్లులు అప్పుడే నెల నెలా ఇవ్వాలి. అలాగే మాకు నెలనెలా ఇవ్వాల్సిన వేతనాలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. విద్యార్థులకు వంటచేసి పెడుతూ మేం అప్పులపాలవుతున్నాం. పిల్లలను ఉపావాసం ఉంచలేక కష్టమైనా భోజనం వండిపెడుతున్నాం.

- చోటుమియా, చౌదరిగూడెం

### భోజన బిల్లులు రూ.2కోట్లు మంజూరయ్యాయి



మధ్యాహ్న భోజన బిల్లులు ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నాం. ఇప్పటికైతే మా వద్ద బిల్లులు పెండింగ్ లేవు. ఎప్పటికప్పుడు బిల్లులను ట్రెజరీకి పంపాం. ఇటీవల భోజన బిల్లులు రూ.2కోట్లు మంజూరయ్యాయి. వాటిని ఏజెన్సీలకు అందజేస్తాం. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 86 స్కూళ్లలో మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాం.

- సుశీందర్‌రావు, డీఈవో

### మా వద్ద బిల్లులు పెండింగ్ లేవు

ట్రెజరీలో మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఏమీ లేవు. ప్రభుత్వం విడుదల చేసిన బిల్లులన్నీ ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నాం. పెండింగ్ బిల్లులను కూడా రెండుమూడు రోజుల్లోనే క్లియర్ చేస్తున్నాం. ఐతే ఐదారు నెలల బిల్లులు రావాల్సి ఉందని భోజన కార్మికులు చెబుతున్న దృష్ట్యా వాటికి సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే మేం వెంటనే ఆయా భోజన ఏజెన్సీలకు చెల్లిస్తాం.

- వెంకట్‌రెడ్డి, జిల్లా ట్రెజరీ అధికారి

## పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు.. గిట్టుబాటు కాని పారితోషికాలు

పాఠశాల విద్యార్థుల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.5.45 చొప్పున, అలాగే ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.8.17 చొప్పున, తొమ్మిది, పదో తరగతుల విద్యార్థులకు రోజుకు ఒక్కొక్కరికి రూ.10.67 చొప్పున ప్రభుత్వం మెస్ బిల్లు చెల్లిస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ ఆకాశన్నంటుతుండగా, ప్రభుత్వం ఇస్తున్న నామమాత్ర పారితోషికాలతో విద్యార్థులకు వంటచేసి భోజనం పెట్టడం కార్మికులకు భారంగా మారింది. దీనికి తోడు రోజూ ఉదయం విద్యార్థులకు రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఇది కార్మికులపై మరింత భారాన్ని పెంచింది. గత దసరా నుంచి అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు 335 స్కూళ్లలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కొనసాగుతోంది. 29,982మంది విద్యార్థులు ఉదయం స్కూళ్లలో టిఫిన్ చేస్తున్నారు. 6 నెలల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి వంట వండుతున్నామని, అయినా ప్రభుత్వం, అధికారులు తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదని భోజన కార్మికులు వాపోతున్నారు. ఇప్పటి వరకు పుట్టినకాడల్లా అప్పులు తెచ్చి విద్యార్థుల ఆకలి తీర్చుతున్నారు. జిల్లాలో మధ్యాహ్న భోజన బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోయాయి. విద్యార్థులు తక్కువున్న స్కూళ్లలో బిల్లులు అందుతున్నాయి. అదే విద్యార్థుల వందల్లో ఉన్న శేరిలింగంపల్లి, యాచారం, నందిగామ, కొందుర్గు వంటి ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో స్కూల్‌లో బిల్లులు రూ.లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయి.


| జిల్లాలో పాఠశాలల వివరాలు | |
|---|---|
| ప్రభుత్వ పాఠశాలలు | మొత్తం విద్యార్థులు |
| 1,309 | 1,45,619 |
| మధ్యాహ్న భోజనం తినేవారి సంఖ్య | 1,18,254 |

### బంగారం తాకట్టుపెట్టి రూ.70వేలు అప్పు తెచ్చాను



బ్యాంకులో నా బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.70వేల అప్పు తీసుకున్నా. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టేందుకు ఆ మొత్తం ఖర్చు చేశాను. ఆరు నెలలుగా మాకు బిల్లు ఇవ్వడం లేదు. బయట ఇక అప్పులూ పుట్టడం లేదు. మాకు ప్రభుత్వం త్వరగా బిల్లులు మంజూరు చేయాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలనెలా అందాల్సిన పారితోషికం సక్రమంగా ఎప్పటిదప్పుడు ఇస్తేనే మేం అప్పులు చేయకుండా వండగలుగుతాం.

- స్వాతి, భోజన కార్మికురాలు, చౌదరిగూడెం




# మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి

» శంభీపూర్ రాజును మార్చిన కేసీఆర్ » చక్రం తిప్పిన హరీశ్‌రావు » కాంగ్రెస్ ఓటమే లక్ష్యంగా పావులు



మేడ్చల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఉప్పల్‌కు చెందిన రాగిడి లక్ష్మారెడ్డిని ఖరారు చేశారు. ఈ విషయాన్ని గురువారం సాయంత్రం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసేందుకు మొదట మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి ఆసక్తి చూపినా తదనంతర పరిణామాలతో తమ కుటుంబం నుంచి ఎవరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయడం లేదని మల్లారెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా బుధవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పోటీలో ఉంటాడని ప్రకటించినప్పటికీ తిరిగి లక్ష్మారెడ్డి పోటీలో ఉంటారని కేసీఆర్ ప్రకటించడంతో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. అసెంబ్లీ ఎన్నికల వరకు ఊపులో ఉన్నా.. బీఆర్ఎస్ నుంచి ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన లక్ష్మారెడ్డి టికెట్ రాక చివరి నిమిషంలో బీఆర్ఎస్‌లో చేరారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నా ఆ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.

### ఎమ్మెల్యే హరీశ్‌రావు జోక్యంతో!


మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఎంపికలో చివరి నిమిషంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చక్రం తిప్పినట్లు సమాచారం. మొదట కేటీఆర్ శంభీపూర్ రాజును పోటీ చేయాలని ఆదేశించినా సామాజిక గణాంకాల ఆధారంగా అభ్యర్థిని మార్చినట్లు తెలుస్తోంది. మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థిగా ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ఆ పార్టీ ప్రకటించింది. ఆయన ప్రచారాన్ని సైతం ఉధృతంగా నిర్వహిస్తున్నారు. అయితే, అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థే పోటీలో ఉంటారని సమాచారం. ఈ తరుణంలో బీఆర్ఎస్ నుంచి బీసీ అభ్యర్థిని పోటీలో నిలిపితే కాంగ్రెస్ పార్టీకి మేలు చేకూరుతుందనే ఉద్దేశంతోనే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మార్చి ఉప్పల్‌కు చెందిన ఓసీ వర్గానికి చెందిన రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపిక చేసినట్టు తెలిసింది. తాము గెలువకున్నా ఫర్వాలేదు గానీ కాంగ్రెస్ అభ్యర్థి మాత్రం గెలవకుండా ఉండేందుకే బీఆర్ఎస్ తన అభ్యర్థిని మార్చినట్టు తెలుస్తోంది. ఈటల కూడా ఒకప్పటి పాత మిత్రుడే కనుక ఇలాగైనా సంతృప్తి చెందొచ్చనే ఆలోచనలోనూ బీఆర్ఎస్ శ్రేణులున్నాయని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

# లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 14 : లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులది కీలక పాత్ర అని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులందరూ వారికి కేటాయించిన అంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అన్ని విషయాలపై నోడల్ టీమ్‌లకు శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్వీప్ నోడల్ అధికారికి సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు ఆయా శాఖలవారీగా సిబ్బంది వివరాలను అందించాలని, ఇంటి చిరునామా, ఎపిక్ కార్డుల వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. ఇప్పటివరకు వివరాలు అందించని శాఖల వారు వెంటనే జిల్లా పరిశ్రమల శాఖ అధికారికి అందజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, సీపీవో సౌమ్య, డీసీవో ధాత్రిదేవి, డీపీవో సురేష్ మోహన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, ఎన్నికల విభాగం అధికారి సైదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నిఘా నీడలో 'పది' పరీక్షలు నిర్వహించాలి

నిఘా నీడలో పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లతో గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మొబైల్ ఫోన్లను అనుమతించొద్దని, హాల్ టికెట్లను పరిశీలించి కేంద్రంలోకి పంపించాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడపాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో మొబైల్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఆశా వర్కర్లను అందుబాటులో ఉంచి అవసరమైన వైద్యసేవలు ప్రతీ పరీక్ష కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్లు పర్యవేక్షణ జరపాలన్నారు. సమావేశంలో డీఈవో సుశీందర్‌రావు, చీఫ్ సూపరింటెండెంట్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

# పాల బిల్లులు చెల్లించాలి

» పాలశీతలీకరణ కేంద్రం వద్ద రైతుల నిరసన

కడ్తాల్, మార్చి 14: పాల బిల్లులు చెల్లించాలని పాడి రైతులు నిరసన వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపులో నెలల తరబడి జాప్యాన్ని నిరసిస్తూ విజయ పాడి రైతులు ఆందోళన చేపట్టారు. కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం ఎదుట గురువారం పాడి రైతులు, పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు పాల క్యాన్లతో నిరసన తెలిపారు. ఆందోళన కార్యక్రమంలో పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని వివిధ మండలాలకు చెందిన పాడి రైతులు, పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, విజయ పాల ఉత్పత్తిదారులకు రెండు నెలలుగా బిల్లులు చెల్లించలేదు. 15 రోజులకోసారి చెల్లించాల్సిన బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పాడి పశువుల, కుటుంబ పోషణకు రైతులు ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. పాల బిల్లులు చెల్లించాలని ఇటీవల టీఎస్ డీడీసీఎఫ్ ఎండీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. నాలుగు రోజుల్లో ఒక బిల్లు చెల్లిస్తామని మిగతావి 20 రోజుల్లో ఇస్తామని తెలిపినా నేటికీ బిల్లులు చెల్లించలేదు. రెండు నెలల బిల్లులతో పాటు 38 నెలలుగా రావాల్సిన లీటర్‌కు రూ. 4 ప్రోత్సాహకం వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడారి రామకృష్ణ, ముత్తి రంగన్న, నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్, అశోక్‌రెడ్డి, సిద్దిగారి కుమార్, సాయిప్రభు, దశరథ్, సత్యం పాల్గొన్నారు.



పాల క్యాన్లతో నిరసన తెలుపుతున్న పాడి రైతులు

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

పరిగి,మార్చి 14: గంగపుత్ర కార్పొరేషన్ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ, పరిగి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం పరిగిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ రాష్ట్ర కార్యదర్శి అనెం అంజనేయులు మాట్లాడుతూ, గంగపుత్రుల సంక్షేమానికి కృషి చేస్తానని ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాయకులు డి.లక్ష్మణ్, బిచ్చయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గంగపుత్రులు

## 'ధరణి' సమస్యలను పరిష్కరించాలి

పెద్దేముల్, మార్చి 14: ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయి విచారణ జరిపి త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. పెద్దేముల్ మండలంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని అక్కడి అధికారులతో మాట్లాడారు. ధరణి సమస్యలపై వాకబు చేశారు. ధరణిలో ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారనే విషయాలపై ఆరాతీశారు. ఈనెల 17వరకు కొనసాగే ధరణి స్పెషల్‌డ్రైవ్‌లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఛాంబర్, రిజిస్ట్రేషన్ ఛాంబర్లను, రికార్డు గదులను పరిశీలించారు. రాబోవు ఎన్నికల్లో కూడా సక్రమంగా పనిచేయాలని సూచించారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

### వాటర్‌ప్లాంట్స్‌పై చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్స్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, జోగు లాలయ్య, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# పర్యాటక రంగంలో డ్రైవర్ల పాత్ర కీలకం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్యాబ్‌డ్రైవర్లు

» ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ జయదేవ్

శంషాబాద్ రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగంలో క్యాబ్ డ్రైవర్లది కీలక పాత్ర అని, టూరిజానికి వారు బ్రాండ్ అంబాసిడర్లు అని ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ అన్నారు. గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో అతిథి దేవో భవ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మంది క్యాబ్‌డ్రైవర్లకు రెండు సెషన్లలో ప్రయాణికులు, పర్యాటకుల పట్ల పాటించే మర్యాదలు, పరిశుభ్రత, సీపీఆర్ తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. జయదేవ్ మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే క్యాబ్/ఆటోడ్రైవర్ల పాత్ర చాలా కీలకమని అన్నారు. విమానాశ్రయం, రైల్వేస్టేషన్లు, డ్రైవర్లు ప్రయాణికులతో ఎలా మెలగాలి అనే విషయమ్మై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న డ్రైవర్లందరికీ ఐఐహెచ్‌ఎం ఇంటర్నేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీమతి మీనాక్షితో డ్రైవర్లు ఇతరుల పట్ల పాటించే మర్యాదలు, వస్త్రధారణ, నడవడికపై శిక్షణ ఇప్పించారు. కాగా, ఎఫ్‌టీసీసీఐ టూరిజం కమిటీ క్యాబ్ డ్రైవర్లకు శుభోదయం, స్వాగతం, ధన్యవాదాలు, దయచేసి, మేఐ హెల్ప్‌యూ వంటి కొన్ని పదాలు నేర్పించారు. హైదరాబాద్ నగరంలో చారిత్రాత్మక పర్యాటక ప్రదేశాలపై అవగాహన కల్పించి డ్రైవర్లకు సీపీఆర్ కిట్లను అందజేశారు. టూరిజం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా, తెలంగాణ ప్రభుత్వం పర్యాటక శాఖ, జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు, అపోలో హాస్పిటల్స్, కోఠారి గ్రూప్, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా, ఐఐహెచ్‌ఎం త్రిపుర కన్‌స్ట్రక్షన్ భాగస్వామ్యంలో కార్యక్రమం నిర్వహించారు.



ఎమ్మెల్యే శంకర్‌ను పరామర్శిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిడి శ్రీహరి

# ఎమ్మెల్యే వీర్లపల్లికి వడదెబ్బ

» లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ

» ఆస్పత్రిలో చేరిన శంకర్.. నిలకడగా ఆరోగ్యం

షాద్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వడదెబ్బకు గురయ్యారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాప్‌రెడ్డిలతో కలిసి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్‌కు వడదెబ్బ తగిలింది. దాదాపుగా అన్ని మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే.. కొందుర్గు మండలానికి చేరుకునే సరికి నీరసించి పోయారు. జిల్లేడ్-చౌదరిగూడ మండలంలో సాయంత్రం నిర్వహించిన బైక్ ర్యాలీలో శంకర్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో నాయకులు వెంటనే ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం శంషాబాద్‌లోని లిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా, నేడు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జరిపేందుకు నాయకులు భారీఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, కార్యకర్తలు, అభిమానులు నిరాశ చెందవద్దని ఎమ్మెల్యే సూచించారు. తనకోసం ఎవరూ ఆసుపత్రికి రావొద్దని, మూడు రోజులు విశ్రాంతి తీసుకోమని వైద్యులు సలహా ఇచ్చారని చెప్పారు.

# భూవివాదంలో జోక్యం.. 36 మందిపై కేసు



వివాదానికి కారణమైన భూమి

» ఈనెల 3న కేసు నమోదు.. ఐదుగురి రిమాండ్

» పరారీలో కల్వకుంట్ల కన్నారావు.. ఆలస్యంగా వెలుగులోకి ఘటన

» ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో భూ వివాదం

ఆదిభట్ల, మార్చి 14 : భూ వివాదంలో తలదూర్చిన మాజీ సీఎం కేసీఆర్ బంధువు సహా 36 మందిపై కేసు నమోదైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కిడి సురేందర్‌రెడ్డి అనే వ్యక్తికి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 32లో వేద కన్వెన్షన్ ఎదురుగా 2.15 గుంటల భూమి ఉంది. సురేందర్‌రెడ్డి ఆ భూమిని చామ సురేష్ అనే వ్యక్తి దగ్గర దాదాపు కోటి రూపాయలు తీసుకొని 2013లో జీపీఏ చేశాడు. తిరిగి డబ్బులు చెల్లించాక భూమిని తన పేరున చేసేలా ఒప్పందం చేసుకున్నాడు. రెండు నెలల తర్వాత సురేష్ భూమిని సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఈక్రమంలో తిరిగి డబ్బులు చెల్లిస్తానని చెప్పిన సురేందర్ రెడ్డి.. 2020 వరకు తిరిగి ఇవ్వకపోవడంతో సురేష్ ఓఎస్ఆర్ గ్రూప్ అనే సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌కు భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. 2020 నుంచి ఇప్పటివరకు ఆ భూమి ఓఎస్ఆర్ గ్రూప్ సంస్థ అధీనంలోనే ఉంది. జక్కిడి సురేందర్‌రెడ్డి.. చామ సురేష్‌తో భూమి విషయం తేల్చుకుంటామని, మధ్యలో మీరెందుకు భూమిని కొన్నారంటూ ఓఎస్ఆర్ గ్రూప్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌తో తరచూ గొడవకు దిగుతూ భూమి హద్దులు తొలగించడం వంటి చర్యలకు పాల్పడ్డాడు. సురేందర్‌రెడ్డితో పాటు అతడి సోదరులపై గతంలో కేసులు నమోదయ్యాయి. దాంతో అతడు బొల్లారంలో ఉండే సురేష్ మామ చంద్రారెడ్డి ద్వారా మాజీ సీఎం కేసీఆర్ బంధువు కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును కలిశాడు. భూ వివాదంలో జోక్యం చేసుకుని సర్దుబాటు చేయడానికి కొంత డబ్బు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందులో కొంత అడ్వాన్స్‌గా ఇచ్చి 2021లో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం(దాదాపు రూ.2 కోట్లు మాట్లాడుకోగా.. అడ్వాన్స్‌గా రూ.40 లక్షలు తీసుకున్నట్లు సమాచారం). ఒప్పందం కుదుర్చుకొని రెండేళ్లు గడిచినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో.. జక్కిడి సురేందర్ రెడ్డి కన్నారావుపై ఒత్తిడి పెంచారు. ఈనెల 3న తెల్లవారుజామున 3 గంటలకు కల్వకుంట్ల కన్నారావు అతడి అనుచరులు డానియేలు, శివలతో పాటు సుమారుగా నలభై మంది వరకు వచ్చి.. భూమి వద్ద వాచ్‌మన్, సెక్యూరిటీ గార్డులపై దాడిచేసి గాయపరిచారు. అక్కడ వాచ్‌మెన్ కోసం వేసిన గుడిసెను తగలబెట్టి జేసీబీ సాయంతో భూమి చుట్టూ ఏర్పాటుచేసిన ప్రీకాస్ట్ ప్రహరీని కూల్చి వేశారు. డయల్ 100 ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ డ్రైవర్‌తో పాటు ఓనర్‌ను మరో ముగ్గురు.. మొత్తం 5 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జక్కిడి సురేందర్‌రెడ్డి, హరినాథ్, కన్నారావులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పర్యవేక్షణలో పన్నెండు మందితో కూడిన మూడు పోలీసు బృందాలు వారికోసం గాలిస్తున్నాయి. ప్రస్తుతం బెంగళూరులో వారు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.



జేసీబీతో ప్రీకాస్ట్ గోడను కూల్చి వేయిస్తున్న కన్నారావు అనుచరులు(ఫైల్)

**పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం**



ఈనెల 3న మన్నెగూడ వేద కన్వెన్షన్ సమీపంలో గొడవ జరుగుతున్నట్లు డయల్ 100కు సమాచారం వచ్చింది. ఎస్ఐ రాజు మిగతా సిబ్బంది అక్కడికి చేరుకొని జేసీబీని సీజ్‌చేసి డ్రైవర్‌తో ఓనర్‌ను అదుపులోకి తీసుకున్నాం. ఐదుగురిని రిమాండ్ చేశాం. పరారీలో ఉన్నవారిని అదుపులోకి తీసుకుంటాం.

- రాఘవేందర్ రెడ్డి, సీఐ, ఆదిభట్ల

# కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



కడ్తాల్ మార్చి 14 : మండల పరిధిలోని చరికొండ శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. చరికొండతో పాటు కడ్తాల, ఆమనగల్లు, యాచారం, కందుకూరు, ఇబ్రహీంపట్నం నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం మోహినిసేవ, గరుడసేవ, ఎదుర్కోళ్లు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించే స్వామి వారి కల్యాణానికి ఆలయం వద్ద పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకుడు, నిర్వాహకుడు చక్రవర్తి శ్రీనివాసాచార్య, ఎంపీటీసీ పాలకుర్ల రాములు, మాజీ సర్పంచ్‌లు నర్సింహాగౌడ్, లక్ష్మయ్య, భీష్మాచారి, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 24 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

» 8 రోజుల పాటు నిర్వహణ » భక్తులకు విశాల ఏర్పాట్లు

» 28న తిరుకల్యాణం, 29న రథోత్సవం





బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన మండపం

తలకొండపల్లి, మార్చి 14 : ప్రాచీన దేవాలయంగా ఖ్యాతి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రంగా బాసిల్లుతున్న తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ అలివేలుమంగ, గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈ దేవాలయంలో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 24నుంచి 31 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తుల రాక నేపథ్యంలో నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పచ్చటి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. 8 రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈఓ స్నేహలత, ఆరాధకులు నడాదూర్ రామాచార్యులు, పరవస్తు గోపాలాచార్యులు వివరించారు. 24న అభిషేకం, రుత్విక్‌కరణం, స్వస్తివాచనం, మృత్సంగ్రహనం, అంకురార్పన, 25న ఆదివాసం, ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, సింహవాహన సేవ, 26న పారాయణం, బలిహరణం,హంసవాహన సేవ, హనుమంత వాహనం, 27న పారాయణం, మోహిని సేవ, బలిహరణం, హోమం, గరుడసేవ, ఎదుర్కోళ్లు, 28న తిరుకల్యాణం, గజవాహనసేవ, 29న నిజరూప దర్శనం, మహాభిషేకం, రథోత్సవం, 30న అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, లంకాదమానం, అశ్వవాహనం, 31న చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన , ధ్వజాఅవరోహణం, పందెం గుండు పోటీ ఉంటాయని వారు తెలిపారు.

# అవినీతి రహిత ప్రజాపాలనే కాంగ్రెస్ ధ్యేయం

» మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, మార్చి 14 : అవినీతి రహిత ప్రజాపాలనే కాంగ్రెస్ ధ్యేయమని, నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేసి కాంగ్రెస్‌ను బలమైన పార్టీగా తయారు చేయాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు. గురువారం మహేశ్వరంలో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను పార్టీ ఎప్పుడు మరిచిపోదన్నారు. గత ప్రభుత్వహయాంలో విచ్చలవిడిగా అవినీతి జరిగిందని ఆరోపించారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేసేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ మండల, గ్రామ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మహేశ్వరం లోని శ్రీరాజరాజేశ్వరాలయం, మన్‌సాన్‌పల్లిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

**కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా లాజర్**

కాంగ్రెస్ మహేశ్వరం పట్టణ అధ్యక్షుడిగా లాజర్, ప్రచార కార్యదర్శిగా శంకర్, అశోక్, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కె. రఘుమారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏనుగుజంగారెడ్డి, కూనయాదయ్య, కాకి ఈశ్వర్‌ముదిరాజ్, అల్లెకుమార్, రఘుపతి, కె. రాములు, దోమ శ్రీనివాస్‌రెడ్డి, రాజునాయక్, లాజర్, శ్రీకాంత్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



మేళాలో బోధనోపకరణాలను పరిశీలిస్తున్న విజయకుమారి

# భూగర్భ జలాలను పెంపొందించాలి

» కేంద్రీయ భూగర్భ జల రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి

వికారాబాద్, మార్చి 14 : భూగర్భ జలాలను పెంపొందించేందుకు వర్షపు నీటిని సంరక్షించుకోవాలని కేంద్రీయ భూగర్భ జల బోర్డు రీజినల్ డైరెక్టర్ జి. కృష్ణమూర్తి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'భూగర్భ జలాలు-సమస్యలు-నిర్వహణ' అనే అశంపై ఉపాధి హామీ క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథి కృష్ణమూర్తి మాట్లాడుతూ కరువు ప్రభావంతో ఉపరితల జలం మానవ అవసరాలకు సరిపోవడం లేదన్నారు. ప్రతీ నీటి బిందువును ఒడిసిపట్టేందుకు పెద్ద మొత్తంలో చెక్ డ్యాంల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. డీఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు చురుగ్గా పాల్గొని భూగర్భ జల మట్టాలను పెంచేలా తగు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ కార్యాక్రమం కింద చెరువు, కుంటల్లోకి వర్షపు నీరొచ్చేలా ఫీడర్ చానెళ్ల ఏర్పాట్లకు కృషిచేయాలని అధికారులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భూగర్భ జలాల శాస్త్రవేత్తలు రాణి, డాక్టర్ సుధీర్‌కుమార్, టి.మాధవ్, అథర్వ పవార్, యాదయ్య, శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

## మేడ్చల్ అభివృద్ధికి రూ.68లక్షలు మంజూరు

మేడ్చల్ టౌన్, మార్చి 14: మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రూ.68లక్షలు మంజూరు చేసినట్లు మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకుడు వేముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇది వరకు సీఎంకు వినతిపత్రం అందించగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలమేరకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రూ.18లక్షలతో కిష్టాపూర్ అర్చన కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.10లక్షలతో గిర్మాపూర్‌లో సీసీరోడ్డు, మరో రూ.10లక్షలతో 2వ వార్డుల్లో సీసీరోడ్డు కింది బస్తీలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.10లక్షలు, మారుతీ అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించినట్లు తెలిపారు. నిధుల కేటాయింపుపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## హక్కుల కోసం పోరాడిన తత్వవేత్త కార్ల్‌మార్క్స్

వికారాబాద్, మార్చి 14: ప్రపంచ కార్మికుల హక్కుల కోసం, దోపిడీ లేని సమాజం కోసం పోరాడిన తత్వవేత్త కార్ల్‌మార్క్స్ అని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.మహేందర్ అన్నారు. కార్ల్ మార్క్స్ 141వ వర్థంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ చరిత్రను మార్చడానికి అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు కార్ల్‌మార్క్స్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీనివాస్, రాజేశ్, శ్రీకాంత్, జైపాల్, అశోక్ పాల్గొన్నారు.

## బహుజన వాదాన్ని తాకట్టు పెట్టడం అనైతికం

వికారాబాద్, మార్చి 14: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజన వాదాన్ని దొరల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టడం అనైతికమని వికారాబాద్ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ కన్వీనర్ రవీందర్ మహారాజ్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారాధన్ మహారాజ్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, యాదగిరి, వెంకటేశ్, శ్రీనివాస్, అశోక్, మల్లేశ్, రాజు, సత్యం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రాజీమార్గమే రాజ మార్గం

వికారాబాద్, మార్చి 14: రాజీ పడదగిన కేసులలో రాజీ కుదుర్చుకునేందుకు ఈనెల 16న న్యాయ శాఖ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ ఏర్పాటు చేయనున్నట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గమే రాజ మార్గమని అన్నారు. కేసుల్లో రాజీ అవ్వాలనుకున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లలో కేసులు ఉన్నవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## చిట్టిఘనాపూర్ పంచాయతీ సందర్శన

తాండూరురూరల్, మార్చి 14: మండలంలోని చిట్టిఘనాపూర్ పంచాయతీని గురువారం డీఎల్‌పీవో శంకర్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని కంపోస్ట్‌షెడ్డు, శ్మశానవాటిక, వన నర్సరీ, తాగునీటి ట్యాంకును సందర్శించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

## కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

షాద్‌నగర్, మార్చి 14 : కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌కు మద్దతుగా గురువారం షాద్‌నగర్ నియోజకవర్గంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని విమర్శించారు. ఆ రెండు పార్టీలు మాటల గారెడీలు తప్ప పేద ప్రజల అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు మారుతాయని వంశీచంద్‌రెడ్డి అన్నారు. దేశంలో తిరిగి ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలుపించాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పాలమూరు ప్రజావాణిని పార్లమెంట్‌లో లేవనెత్తి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాల జడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

# ధ్యానం, సంగీతంతో మానసిక ప్రశాంతత

» పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్ » కన్హా శాంతివనంలో ఘనంగా ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం

» మొదటిరోజు ఆకట్టుకున్న ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ కచేరీ » వేల సంఖ్యలో హాజరైన యోగా అభ్యాసకులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ బృందం

నందిగామ, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ధ్యానం, శాస్త్రీయ సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాంచంద్ర మిషన్ గురూజీ, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్ అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతివనంలో రాంచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఆధ్యాత్మిక సమ్మేళనంలో భాగంగా మొదటిరోజు గురువారం ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ కచేరీ నిర్వహించి పాటలతో అలరించారు. కమలేష్ పటేల్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక సమ్మేళనం ప్రపంచ శాంతికి ఎంతగానో దోహదపడుతుందఅన్నారు. కన్హా శాంతివనానికి 130 దేశాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యాసకులతో ఆశ్రమంలో పండగ వాతవరణం నెలకొంది.

**నేడు హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రేపు ఉపరాష్ట్రపతి..**

గురువారం నుంచి ఈ నెల 17 వరకు నిర్వహించే ఆధ్యాత్మిక మహోత్సవంలో భాగంగా నేడు(శుక్రవారం) రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రేపు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ హాజరుకానున్నారు. రాష్ట్రపతి రాక సందర్భంగా పోలీసులు కన్హా శాంతివనంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్రపతి గ్లోబల్ స్పిరిచ్యువాలిటీ మహోత్సవ్‌ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల నుంచి సుమారు 300 ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, అన్ని మతాలకు చెందిన మతపెద్దలతో పాటు లక్ష మందికి పైగా ప్రముఖులు హాజరుకానున్నారు. దేశ విదేశాల నుంచి చినజీయర్‌స్వామి, అభిజిత్ హల్దర్, ఆచార్య ధీరేంద్ర కృష్ణశాస్త్రి, రాందేవ్‌బాబా, భావజైన్, బీకే మృత్యుంజయ, శివాని, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమలేష్ పటేల్, దస్తూరిజీ ఖుర్షీద్, దేవి చిత్రలేఖ, స్వామి చిదానంద, జగద్గురు రామభద్రాయచారి, మాతా అమృతామయి, ఆర్ట్ ఆఫ్‌లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్, సినీ ప్రముఖులు వెంకటేష్, సమంత, కీర్తిశెట్టి, కబీర్‌బేడీ, మాధుర్ బండార్కర్, శేఖర్ కపూర్, శంకర్ మహదేవన్ తదితరులు తరలిరానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న అభ్యాసకులు, తదతరులు

# పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


ఎంఈవో సర్దార్ నాయక్

కడ్తాల్ , మార్చి 14 : పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణ కోసం కడ్తాల మండలంలో అధికారులు పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వాహణకు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఎక్కడ మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు చేపట్టారు. మార్చి 18 నుంచి 30 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభమై మధ్యాహ్నం 12:30 వరకు కొనసాగుతాయి. పదో తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లను మండల విద్యాధికారి సర్ధార్ నాయక్, నోడల్ అధికారి జంగయ్య గురువారం వెల్లడించారు. మండల పరిధిలో 10 ఉన్నత పాఠశాలలకు చెందిన 409 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మండల కేంద్రంలోని నాలుగు ప్రభుత్వ మూడు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం కడ్తాల బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏ పరీక్ష కేంద్రంలో 220మంది, బీ పరీక్ష కేంద్రంలో 194 మంది, ముద్విన్ పరీక్షా కేంద్రంలో ముద్విన్, ఎక్వాయిపల్లి, చరికొండ ఉన్నత పాఠశాలలకు సంబందించి 95 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రావిచేడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కేశంపేట మండలం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు.

**మాడ్గుల :** ఈనెల 18 నుంచి 30 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిచబోతున్నామని ఎంఈవో వడ్త్యావత్ సర్దార్ తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఏ సెంటర్‌లో 185మంది, బీ సెంటర్‌లో 178మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 132మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈవో తెలిపారు. విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

**విద్యార్థులకు హాల్‌టికెట్ల పంపణీ**

**తలకొండపల్లి :** మండలంలోని ఖానాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేసి, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చంప్లా నాయక్ మాట్లాడుతూ ఉన్నత విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శారదాదేవి, లక్ష్మి, మల్లేష్, రాజ్యలక్ష్మి, తులసీ, సతీష్, బాలస్వామి తదితరులున్నారు.

## భూ వివాదం పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

యాచారం, మార్చి 14 : మండలంలోని గున్‌గల్ గ్రామంలో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ భూ వివాదం పరిష్కరించి గుడి నిర్మాణం కోసం సహకరించాలని యాచారానికి చెందిన పలువురు భక్తులు, గ్రామస్థులు గురువారం నగరంలోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రమందించారు. గ్రామంలోని 561 సర్వే నెంబర్‌లో శివాలయానికి చెందిన రెండెకరాల భూమి ఉండగా పలువురు వ్యక్తులు ఆ భూమిపై వివాదం రేపుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారం చూపాలని వారు కోరారు. వైస్ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్, మాజీ ఎంపీటీసీ కె.యాదయ్య ఉన్నారు.

## ఆర్డీవోను కలిసిన ఎంపీడీవో


ఆర్డీవోను సన్మానిస్తున్న ఎంపీడీవో

కందుకూరు, మార్చి 14 : ఇటీవల కందుకూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన బి.సరిత గురువారం ఆర్డీవో సూరజ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం మండలంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలపై చర్చించుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలని ఆర్డీవో ఎంపీడీవోకు సూచించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

చేవెళ్ల, మార్చి 14 : ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కంచన లత తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిసిన నేపథ్యంలో అధ్యాపకులు పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. డిగ్రీలో ప్రవేశాలు పొందే విద్యార్థులకు ఉచితంగా దోస్త్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు అనురాధ, రూప్న, వైష్ణవి, జ్యోతి, షేక్ మహబూబ్, రవీందర్ ఉన్నారు.

## గుర్తింపు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల, మార్చి 14 : గుర్తింపు లేకుండా నడుస్తున్న వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం వారు చేవెళ్లలో మాట్లాడుతూ మండల పరిధిలోని వివేకాంద ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు లేకుండా నడుస్తున్నా మండల విద్యాశాఖ అధికారి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ స్కూల్ యాజమన్యం పేరెంట్స్‌కు అనేక మాయ మాటలు చెప్పి అడ్మిషన్లు చేస్తున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

## కేంద్రంలోనూ అధికారంలోకి కాంగ్రెస్


నిరంజన్ గౌడ్

మొయినాబాద్ రూరల్, మార్చి 14 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా కేంద్రంలోనూ అధికారంలోకి కాంగ్రెస్ రావడం ఖాయమని యువజన కాంగ్రెస్ మొయినాబాద్ మండల అధ్యక్షుడు గౌండ్ల నిరంజన్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తమ ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని గుర్తుచేశారు. పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

చేవెళ్ల, మార్చి 14 : మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు వారాంతపు సెలవు, ప్రతినెల సబ్బులు, నూనెలు, ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫామ్‌లు, గ్లౌజులు, షూస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జీవో 60 ప్రకారం కార్మికులందరికీ 16,600 వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులపై మున్సిపల్ అధికారుల ఒత్తిడి తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బీజేపీ మండలాధ్యక్షుడిగా జంగయ్య


జంగయ్య

మంచాల, మార్చి 14 : భారతీయ జనతా పార్టీ మంచాల మండల అధ్యక్షుడిగా ఆరుట్ల గ్రామానికి చెందిన పాండాల జంగయ్య నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ద్వారా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఇప్పటిదాకా ఆయన ఇన్‌చార్జి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తాజాగా పూర్తిస్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాండాల జంగయ్య మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర నేతలు జి.లచ్చిరెడ్డి, వింజమూరి వెంకటరెడ్డి, మారమోని శ్రీశైలంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మన్‌సాన్‌పల్లిలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, మార్చి 14 : మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో రెండు సంవత్సరాలకోసారి వైభవంగా నిర్వహించే శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాలు గురువారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో శివసత్తుల పూణకాలు, పోతురాజుల విన్యాసాలు, యువతీయువకుల కేరింతలు ప్రత్యేక ఆకర్శణగా నిలిచాయి. ఎల్లమ్మ అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. బోనాల సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కేఎల్ఆర్ తదితర నాయకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న పైముదా

చేవెళ్ల, మార్చి 14 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పైముదా అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షురాలు వడ్ల మంజుల అధ్యక్షతన అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పైముదా మాట్లాడుతూ జనాభాలో సగభాగమైన మహిళలకు పురుషులతో పాటు సమాన హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా పోతున్నాయన్నారు. మహిళల కోసం ఎన్ని చట్టాలు వచ్చినా సమాజంలో గౌరవం దక్కకపోగా లైంగిక వేధింపులు, వరకట్నచావులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళందరు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, మండల కార్యవర్గ సభ్యులు అనురాధ, యాదమ్మ, జయమ్మ, ఏఐటీయూసీ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ చారి, సత్తిరెడ్డి, మగ్బుల్, జె. అంజయ్య, ఉన్నారు.

## గ్రామాల్లో ఆర్మ్‌డ్ ప్రొటక్షన్ ఫోర్స్ కవాతు


కవాతు చేస్తున్న పోలీసులు

యాచారం, మార్చి 14 : త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా జరిగేట్లు ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని యాచారం ఇన్‌స్పెక్టర్ శంకర్‌కుమార్, ఎస్సై గోపాల్ అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, చిన్నతూండ్ల గ్రామాల్లో సెంట్రల్ ఆర్మ్‌డ్ ప్రొటక్షన్ ఫోర్స్ బలగాలతో వారు కావాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి వారు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా గొడవలకు దిగినా, ఓటర్లను మభ్య పెట్టి బెదిరించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు


సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు

చౌదరిగూడ, మార్చి 14 : రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ అధికారులను అదేశించారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా అధికారులు నీటి సరాఫరాను మరింత పెంచాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కారించాలని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


**సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలి**

ఆమనగల్లు : పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు ఉత్పన్నం కాకుండ చూడాలని ఎంపీడీవో పారుఖ్ హుస్సెన్ అన్నారు. విధుల నిర్వాహణలో ఎక్కడ అలసత్వానికి తావివ్వకూడదని సూచించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, హరితహారం మొక్కలు ఎండిపోకుండ చూడాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు తగిన వసతులు కల్పించాలన్నారు. ఎంపీవో శ్రీలత, ఏపీవో మాధవరెడ్డి, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**సకాలంలో పన్నులు వసూళు చేయాలి**

చేవెళ్ల : ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామాల్లో ఇంటి పన్నులను సకాలంలో వసూళు చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య చెప్పారు. గురువారం శంకర్‌పల్లి మండలపరిషత్ కార్యాయలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలఖారు వరు వంద శాతం పన్నులు వసూళు చేయాలని ఆదేశించారు. నర్సరీల్లో మొక్కలకు సక్రమంగా నీళ్లు అందించాలని సూచించారు.

## ఎన్‌వైకే ఆధ్వర్యంలో యువతకు క్రీడా పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

ఆమనగల్లు, మార్చి 14 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నెహ్రూ యువ కేంద్రం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కోకో, క్యారమ్, రన్నింగ్ పోటీల్లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీడీవో పారుఖ్‌హుస్సెన్ పోటీలను ప్రారంభించారు. హెచ్‌ఎం పాండు, పీడీ జ్యోతి, ఆనంద్ పర్యవేక్షణలో పోటీలు కొనసాగాయి. రన్నింగ్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మీనాక్షి మొదటి బహుమతి, కావ్య రెండవ బహుమతి, సంతోష మూడవ బహుమతి కైవసం చేసుకున్నారు. వాలీబాల్ పోటీల్లో కోనాపూర్‌టీం మొదటి బహుమతి, రాంనుంతల టీంకు రెండవ బహుమతి లభించింది. కోకో పోటీలలో ఆకుతోటపల్లి, రాంనుంతల, మేడిగడ్డ టీంలు పాల్గొనగా మొదటి బహుమతి రాంనుంతల, రెండవ బహుమతి మేడిగడ్డ టీంలు గెలుచుకున్నాయి. వారికి ఎంపీడీవో బహుమతులు ప్రదానం చేశారు.

## రేషన్ బియ్యం కొంటే క్రిమినల్ కేసులు


సూచనలు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

కడ్తాల్, మార్చి 14 : రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు కొని, అక్రమంగా తరలించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ అన్నారు. గురువారం కడ్తాల మండలంలోని ఎక్వాయ్‌పల్లిలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి ఫినోమిషన్ వాడకంపై డీలర్‌కు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడచుకోవాలన్నారు. కొందరు రేషన్ బియ్యాన్ని అధిక దరలకు కొని తిరిగి రైస్ మిల్లులకు తరలిస్తున్నారని తమకు సమాచారముందన్నారు. బియ్యం సరఫరాలో అక్రమాలకు తావు లేదన్నారు.

## కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్

మాడ్గుల, మార్చి 14 : మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాల్లో ఈ నెల 9 నుంచి పోషణ మాసం వేడుకలు కొనసాగుతున్నాయని అంగన్‌వాడి సూపర్‌వైజర్ ఏ జయమ్మ తెలిపారు. మండలంలోని నాగిళ్ళగుడి తండాలో గురువారం పోషణ మాసం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ చిన్నారుల తల్లులు, గర్భిణీలు హజరయ్యారు. గర్భిణీలకుపోషకాహారంపై ఆమె అవగాహన కల్పించారు. తల్లులు ఆరోగ్యంగా ఉండాలంటే చిరుదాన్యాలు తినాలని సూచించారు. అంగన్‌వాడి టీచర్లు బి యాదమ్మ, వరలక్ష్మివెంకటమ్మ పాల్గొన్నారు.

## 'పట్నం' పరిధిలో మోస్తారు వర్షం

ఇబ్రహీంపట్నం, మార్చి 14: ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల పరిధిలో గురువారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. అకాల వర్షంతో వేసవి ఎండలకు ఉక్కపోతగా ఉన్న వాతావరణం కొంతమేరకు చల్లబడింది. కాగా వర్షం మూలంగా పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చీకటికి తోడు రోడ్లపై నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

## చికిత్స పొందుతున్న మహిళకు రక్తదానం


సాయిబాబాను సన్మానిస్తున్న డాక్టర్, సిబ్బంది

ఆమనగల్లు, మార్చి 13 : ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు రక్తదానం చేసి ఔదార్యం చాటాడు ఓ యువకుడు. వివరాలిలా ఉన్నాయి. ఆమనగల్లు మున్సిపాలటీ సాయినగర్ కాలనీకి చెందిన మేఘన అనారోగ్యంతో పట్టణంలోని లక్ష్మి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఆమెకు రక్తం తక్కువ ఉండడంతో ఆరోగ్యం క్షీణించింది. రక్తం అవసరమని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న మెగాస్టార్ చిరంజీవి అభిమాని పాతకోట సాయిబాబ ఉదారంగా ముందుకు వచ్చి రక్తదానం చేశాడు. రక్తదానం చేసిన ఆయనను ఆసుపత్రి వైద్యురాలు శారద, సిబ్బంది సత్కరించి అభినందించారు. రమేశ్, ప్రకాశ్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి


బహుమతులు అందజేస్తున్న వెంకటేశ్

కడ్తాల్ , మార్చి 14 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ప్రణాళిక బద్దంగా చదివి తమ లక్ష్యాలను చేరుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలోని విద్యాభారతి మోడల్ స్కూల్‌లో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పాఠశాల ఆవరణలో పాఠశాల చైర్మన్ లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గంప వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, పీపీసీఎస్ డైరెక్టర్ వెంకటరెడ్డి, మల్లేశ్, సతీష్, ఉపాధ్యాయులు శోభారాణి, ఉమారాణి, మౌనిక, మమత, పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**చేవెళ్ల, మార్చి 14 :** ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం నేడు (శుక్రవారం) చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్‌గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు కాడిగల్ల ప్రవీణ్ కుమార్‌మాదిగ తెలిపారు. సాయంత్రం 3 గంటలకు సమావేశం ఉంటుందని, ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని చెప్పారు. అన్ని మండలాల నుంచి పెద్దసంఖ్యల్లో నాయకులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**ఆమనగల్లు , మార్చి 14:** సంత్ సేవాలాల్ లంబాడి కార్పొరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణానాయక్ హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**మంచాల, మార్చి 14 :** బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూరనర్సయ్యగౌడ్ శుక్రవారం మంచాల మండలంలో పర్యటిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య తెలిపారు. ఉదయం 9 గం.లకు నోములలో ప్రారంభమై లింగంపల్లి, తాళ్లపల్లిగూడ, చిత్తపూర్, తిప్పాయిగూడ, ఆరుట్ల, జాపాల మీదుగా మంచాల దాకా సాగే ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చాడు.

**తలకొండపల్లి, మార్చి 14:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈనెల రేపు (శనివారం) నిర్వహించే ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్ కోరారు. తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం పార్లమెంట్ ఎన్నికలు, మోదీ సభ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

**మాడ్గుల, మార్చి 14 :** మాడ్గుల మండలంలోని ఆర్కపల్లి గ్రామానికి చెందిన సీత చిన్న బస్వలింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా సింగల్ విండో డైరెక్టర్ కల్లు రాజవర్ధన్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5000, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంటేష్ రూ.3000 అందజేశారు.

**ఆమనగల్లు , మార్చి 14:** మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికిచెందిన కటుకూరి సాయిలు , గడియ యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను గురువారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం , మాజీ సర్పంచ్ గోదాదేవి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

## క్రైం కార్నర్

### అతివేగంతో బైక్‌ను ఢీకొన్న కారు, వివాహిత మృతి

- ఆమె భర్తకు తీవ్ర గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

చేవెళ్ల, మార్చి 14 : ముందు వెళుతున్న బైక్‌ను అతివేగంగా వచ్చిన ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా ఆమె భర్తకు తీవ్రగాయాలయిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లారెడ్డిగూడ స్టేజీ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. షాబాద్ మండల పరిధిలోని బొబ్బిలిగామా గ్రామానికి చెందిన భార్యాభర్తలు నవనీత, మల్లయ్య హైదరాబాద్ నగరంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వేళ్లేందుకు బైక్ వస్తున్నారు. మార్గమధ్యలో చేవెళ్ల మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ స్టేజీ సమీపంలోకి రాగానే వారి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న భార్య, భర్తలకు తీవ్రగాయలు కావడంతో 108 అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో నవనీత(38) మార్గ మధ్యలో మృతి చెందింది. ఆమె భర్త పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ అతివేగంగా కారు నడపవడంతోనే బైక్‌ను ఢీకొట్టిందని స్థానికులు స్పష్టం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

### మద్యం మానేయమని సోదరి మందలించడంతో వలస కూలీ ఆత్మహత్య

కందుకూరు, మార్చి 14 : మద్యానికి బానిసైయ్యాడని, వెంటనే మానాలని ఓ వ్యక్తిని తన సోదరి మందలించడంతో వలస కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం ఉదయం పోలీసులకు మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒరిస్సాలోని నుపడా జిల్లా కొత్తిపాడ గ్రామానికి చెందిన బిష్ణుమజిహి(27) జీవనోపాధి కోసం మూడు నెలల క్రితం తన సోదరి జయమజిహి నివాసం ఉంటున్న రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం రాచులూరు గ్రామానికి వచ్చాడు. అక్కడే ఉన్న కేఎస్‌బీ(బ్రిక్స్) ఇటుక బట్టిలో కూలీ పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై పనిచేయకుండా ఉండడంతో బుధవారం రాత్రి 9గంటలకు బిష్ణుమజిహి ఇంట్లో అన్నం తినే సమయంలో సోదరి జయమజిహి అతన్ని మందలించింది. జీవనోపాధి కోసం ఇక్కడికి వచ్చి మద్యం అతిగా సేవించడం సరికాదని అతని పద్దతి మార్చుకోవాలని మందలించింది. మద్యం మత్తులో ఉన్న బిష్ణుమజిహి మనస్థాపానికి గురై అలిగి వెళ్లి ఇటుక బట్టి సమీపంలో ఉన్న ఓ చింత చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సేపటికి అతని బావ బిష్ణుమజిహిని వెతకడంతో అప్పటికే చెట్టుకు ఉరి వేసుకొని ఉన్నట్లు గుర్తించాడు. తోటి స్నేహితులతో కలిసి అతన్ని కిందకు దించి చూసే సరికే బిష్ణుమజిహి మృతి చెందాడు. మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ మక్బుజాని తెలిపారు.

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆమనగల్లు, మార్చి 14 : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండా వద్ద గురువారం గుర్తుతెలియని ఓ మృతదేహం లభించగా ఆమనగల్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెంటతండా సమీపంలోని ఓ వెంచర్‌లో 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారమందింది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష కోసం సివిల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడు 5.8 అడుగుల ఎత్తు కలిగి, నీలిరంగు చొక్కా, నల్లరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రాంనాయక్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మాడ్గుల, మార్చి 14 : మండలంలోని నల్లచెర్వు గ్రామానికి చెందిన కట్టసతీష్(20) అనే యువకుడు బుధవారం తన స్నేహితుడి వివాహానికి హాజరై తిరిగి రాత్రి సమయంలో హైదరాబాద్‌కు వెళుతుండగా రామన్నగూడెం సమీపాంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రణాపాయ స్థితిలో ఉన్నట్లు అతని కుటుంబసభ్యులు తెలిపారు. వారు చెప్పిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న సతీష్‌ను చికిత్స నిమిత్తం పోలీసులు అంబులెన్స్‌లో ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపినట్లు ఎంఆర్‌పీఎస్ నాయకుడు కట్ట జగన్ చెప్పారు. కాగా ఈ సంఘటనపై యువకుడి తండ్రి రాములు ఆదిపట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## బీజేపీతోనే సుస్థిర పాలన


మాట్లాడుతున్న ఎంపీ రాములు

ఆమనగల్లు, మార్చి 14 : బీజేపీ తోనే సుస్థిర పాలన, అభివృద్ధి సాధ్యమని ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. కేంద్రంలో మరో మారు బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ నాయకులతో ఎంపీ రాములు హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం పార్లమెంట్ ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితో కలిసి చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలు బీజేపీ భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలను ప్రజలు విశ్వసించడం లేదని ఈ నేపథ్యంలో తెలంగాణలో బీజేపీ ప్రత్యమ్నాయ శక్తిగా నిలుస్తుందని అన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, బండెల రామచంద్రారెడ్డి, కండె హరిప్రసాద్, గోరటి నర్సింహా, రాంపాల్‌నాయక్, దుర్గయ్య, లక్ష్మణ్, మన్యనాయక్, రవీందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, రాందాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడితేనే విజయాలు సొంతం

మొయినాబాద్ రూరల్, మార్చి 14 : పోటీ ప్రపంచంలో కష్టపడి పనిచేస్తే విజయాలు సొంతమవుతాయని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన రవికుమార్‌రెడ్డి అనే విద్యార్థి రసాయశాస్త్రం విభాగంలో 'డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ సమ్ న్యూహెటిరో సైక్లిక్ హైబ్రిడ్స్ అండ్ దెయిర్ యాంటీ క్యాన్సర్ ఎవాల్యూయేషన్' అనే అంశం పై ప్రొఫెసర్ టీ. నర్సింహస్వామి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. మాధవిలత అనే మరో విద్యార్థిని 'సింథసిస్ ఆఫ్ నైట్రల్స్, చాల్కోన్, పార్ఫెరిన్స్ క్రోమో అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ దెయిర్ బయోలాజికల్ యాక్టివిటీ' అనే అంశంపై డాక్టర్ అమర్‌నాథ్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా వారిని డాక్టర్ సాత్వికరెడ్డి అభినందించి సన్మానించారు. ప్రొఫెసర్లు దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, కవిత, డీన్ క్రిస్టోఫర్, జగదీష్, అధ్యాపక బృందంతో పాటు పబ్లిక్ రిలేష్ అధికారి గాదె రాంబాబు, పాల్గొన్నారు.

## పంటల సాగులో మెళకువలు పాటించాలి


పంటను పరిశీలిస్తున్న ఏవో రాజు

తలకొండపల్లి, మార్చి 14 : పంటల సాగులో రైతులు తగిన మెళకువలు పాటంచాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజు సూచించారు. ఆధునిక సేద్యం రైతులకు లాభదాయకమని చెప్పారు. మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. పలువురు రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో శిరీష, రైతులు పాల్గొన్నారు.